క్లుప్తంగా

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న నర్సింహారావు తదితరులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని ఖలీల్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 40 మంది విద్యార్థులకు విశ్రాంత ఉద్యోగి నర్సింహరావు కుల్‌కర్ణి, ఎంఈఓ మారుతి రాథోడ్‌తో కలసి బుధవారం ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిర్జాపూర్(బి) జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ జగదాంబ, మాజీ ఉపసర్పంచ్ సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, సిద్ధారెడ్డి, విఠల్‌రెడ్డి, మాణయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్: సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును బుధవారం డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి లబ్ధిదారుకు అందజేశారు. హన్మంతరావుపేటకు చెందిన భాగ్య, నిజాంపేట మండలం బాచేపల్లికి చెందిన సత్యనారాయణకు సంబంధించిన చెక్కులను జిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి అందించారు. ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటకు చెందిన సబాబేగం మంజూరైన చెక్కును భూపాల్‌రెడ్డి పంపిణీ చేశారు.

సునీతాపాటిల్‌ను కలిసిన నరేష్ గౌడ్



జహీరాబాద్ టౌన్: యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా నరేష్ ఎన్నికైన సందర్భంగా మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు సునీతా పాటిల్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో నరేష్‌గౌడ్ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో ఆమెను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



నారాయణఖేడ్: సిద్దిపేటలో 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్న ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయ్, అభిలాష్, రామ్, విఘ్నేష్, సునీల్ విద్యార్థులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన ఆటో..

నలుగురికి గాయాలు




చెట్టును ఢీకొట్టిన ఆటో

వట్‌పల్లి(అందోల్): ఆటో చెట్టును ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయిన సంఘటన అందోల్ మండలంలోని అన్నాసాగర్ గ్రామ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. జోగిపేట ఎస్‌ఐ పాండు కథనం ప్రకారం.. మాసాన్‌పల్లి, జోగిపేట, చిట్కుల్ గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులు చిలాప్‌చెడ్ వెళ్లే ఆటోలో ఎక్కారు. ఆటో డ్రైవర్ నర్సింలు నిర్లక్ష్యంగా అతివేగంగా ఆటోను నడపడంతో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న మర్రిచెట్టును బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న నలుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

జోరుగా జీరో దందా..

- ప్రైవేట్ కాంటాలతో ఆదాయానికి గండి
- మార్కెట్ కమిటీ తీర్మానం బుట్టదాఖలు
- లైసెన్సులు లేకుండానే పత్తి కొనుగోళ్లు



వట్‌పల్లిలో ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసిన పత్తిని లారీలో నింపుతున్న కూలీలు

వట్‌పల్లి(అందోల్): పత్తి కొనుగోళ్ల ప్రారంభమవగానే దళారులు దందాకు తెరలేపారు. మార్కెట్ యార్డుల్లోనే కొనుగోలు చేయాలన్న నిబంధన ఉల్లంఘించి దర్జాగా ప్రైవేట్ కాంటాలు పెట్టి జీరో దందాను సాగిస్తున్నారు. వట్‌పల్లితో పాటు గ్రామాల్లో చిల్లర కాంటాల వ్యాపా రం విచ్చలవిడిగా కొనసాగుతుంది. దీంతో మార్కె ట్ ఆదాయానికి గండి పడటంతో పాటు రైతులు కూడా నష్టపోతున్నారు. లైసెన్సులు లేకుండా పత్తి ని కొనుగోలు చేస్తూ లక్షలు గడిస్తున్నారు. మార్కెట్ కమిటీ అధికారులు పట్టించుకోకపోవడంతో పత్తి వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

నిలువు దోపిడీ..

అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన రైతులకు మద్దతు ధర దొరకడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన ధర ఇవ్వకుండా తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయాధికారులు పంట వివరాలను సరిగ్గా నమోదు చేయకపోవడంతో పాటు సీసీఐ అధికారులు తేమ పేరుతో తిరస్కరిస్తున్నారు. దీంతో దిక్కుతోచక రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దీనిని ఆసరా చేసుకొని మద్దతు ధర కంటే రూ. 600 నుంచి రూ.1000 తక్కువకు కొనుగోలు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు.

చిల్లర కాంటాల్లో మోసం..

కొందరు వ్యాపారులు చిల్లర కాంటాలను వినియోగిస్తూ అమాయక రైతుల నుంచి తూకం చేసే సమయంలో 4 నుంచి 5 కిలోల పత్తిని దోచుకుంటారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొందరూ ఎలక్ట్రానిక్ కాంటాలను వాడుతున్నారు. రిమోట్ ఆపరేట్ సిస్టంతో గండి కొడుతున్నారని విమర్శలు ఉన్నాయి.

మార్కెట్ పాలకవర్గ తీర్మానం బుట్టదాఖలు

ఇటీవల వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ఎన్నికైన గత నెల నవంబర్ 9న మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి అధ్యక్షతన మార్కెట్ కార్యాలయంలో పాలకవర్గం సమావేశమై పలు తీర్మానాలు ఆమోదించింది. ఇందులో భాగంగా అనుమతి లేకుండా చిల్లర కాంటాలు పెట్టి పత్తి కొనుగోళ్లు చేసే దళారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తీర్మానించారు. వెంటనే మార్కెట్ అధికారులు వట్‌పల్లిలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ కాంటాలను తీసుకువచ్చారు. నాయకుల పలుకుబడితో మార్కెట్ అధికారుతో మాట్లాడించి తిరిగి కాంటాలను తీసుకెళ్లి జీరో దందాను నడుతుండడంతో మార్కెట్ కమిటీ పాలకవర్గ చేసిన తీర్మానం బుట్టదాఖలైంది.

12 మందికి నోటీసులు

నిబంధనలకు విరుద్ధంగా జీరో దందా నడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఇటీవలే మార్కెట్ పాలకవర్గ సమావేశంలో తీర్మానించాం. వట్‌పల్లిలో ఇప్పటికే అనుమతి లేకుండా ప్రైవేట్ కాంటాలు పెట్టి పత్తి కొనుగోళ్లు చేస్తున్న 12 మందికి నోటీసులు ఇచ్చాం. వారిపై చర్యలు తీసుకుంటాం. రైతులు తమ పంటను దళారులకు అమ్మి మోసపోవద్దు. ప్రభుత్వ పత్తి కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

–సునీల్, మార్కెట్ కార్యదర్శి, వట్‌పల్లి మార్కెట్‌యార్డు

జాతీయ క్రీడల్లో విద్యార్థిని ప్రతిభ



అక్షయ

సంగారెడ్డి : ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ క్రీడల్లో ఐబీటీ డీఏవీ కంది విద్యార్థిని సగ్గుల అక్షయ ప్రతిభ కనబరిచింది. షాట్‌పుట్ నేషనల్ గేమ్స్‌లో మూడవ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ శ్రీకర్ బసవ తెలిపారు. పుల్‌కల్ మండలం, కోడూరుకు చెందిన అక్షయ డీఏవీ ఐబీటీ కందిలో తొమ్మిదవ తరగతి చదువుతుంది. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపడంపై పలువురు ప్రశంసిస్తున్నారు. అలాగే, ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ఉమ్మడి జిల్లాస్థాయిలో షాట్‌పుట్ మొదటి స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయి క్రీడల్లో ఖమ్మంలో పాల్గొన్నారు. బ్యాడ్మింటన్‌లో జిల్లా స్థాయిలో మూడవ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంది.

బీహెచ్‌ఈఎల్‌లో మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్, సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ పరిపాలన భవనం వద్ద బుధవారం భెల్, బీడీఎల్ సీఐఎస్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, రాష్ట్ర అగ్నిమాపక దళం సంయుక్త ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ముఖ్యఅతిథులు భెల్ ఈడీ కేబీ.రాజా, భెల్ హెచ్‌పీఈపీ ఈడీ విజయ్‌సాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ అగ్నిప్రమాదాలు, భూకంపాలు, భవనాలు కూలిపోయి అందులో చిక్కుకున్న వారిని ఎలా రక్షిస్తారో రిస్క్ ఆపరేషన్ మాక్‌డ్రిల్ ప్రదర్శించారు. విపత్తుల సమయంలో ప్రజలను సురక్ష ప్రాంతాలకు తరలించడంపై కార్మికులకు మాక్‌డ్రిల్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐఎస్‌ఎఫ్ కమాండెంట్ మంజిత్ కుమార్, అసిస్టెంట్ కమాండర్ దామోదర్‌సింగ్, ఇన్‌స్పెక్టర్ బి.ఎస్.బండారి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

భవనం నిర్మాణానికి భూమిపూజ



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): వ్యవసాయ సహకార పరపతి సంఘం భవన నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సీడీసీ చైర్మన్ రాంరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం కొండాపూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవన నిర్మాణానికి బుధవారం రాంరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.36 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. చాలా సంవత్సరాలుగా సొంత భవనం లేకపోవడంతో వ్యవసాయ పరపతి సంఘం అద్దె భవనాలలోనే కొనసాగిందన్నారు. అనంతరం కొండాపూర్ పీఏసీఎస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీ ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, పీఏసీఎస్ కార్యనిర్వహణ అధికారి సిరాజ్, నాయకులు నర్సింహారెడ్డి, ప్రభుదాసు, రుక్మోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గిరిధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



క్రేన్ సహాయంతో గిరిధర్‌కు పూలమాల వేస్తున్న అభిమానులు

జహీరాబాద్ టౌన్: తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు ఎస్. గిరిధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అభిమానులు, కాంగ్రెస్ నాయకులు తరలివచ్చి, భారీ ఊరేగింపు నిర్వహించి, లైఫ్ స్టైయిల్ కాంప్లెక్స్ వద్ద కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా భారీ క్రేన్ సహాయంతో పూలమాల వేశారు. అనంతరం అక్కడి నుంచి ఎంపీపీ కార్యాలయం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. పలువురు నాయకులు, అభిమానులు ఆయనను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ మండలాల అధ్యక్షులు, అభిమానులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్‌లో కస్తూర్బా బాలికల పాఠశాలను ఎంఈఓ శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి స్వప్న ఉన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా నలుగురికి రూ. 2 వేలు, ఐదుగురికి రూ. 1500, మరో ముగ్గురికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

లబ్ధిదారుల అర్హత పరిశీలన

జిన్నారం (పటాన్‌చెరు): ఇందిరమ్మ ఇళ్ల అర్హత పరిశీలనకు ప్రభుత్వం సర్వే చేసేందుకు సిద్ధమైందని మున్సిపల్ కమిషనర్ మంగతాయారు పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. సర్వే నిర్వహించడానికి మున్సిపాలిటీలోని 22 వార్డులకు వార్డుల వారీగా ఒక ప్రత్యేక అధికారులను నియమించారు. సర్వేలో భాగంగా సేకరించిన సమాచారాన్ని లాగిన్‌లో అప్‌డేట్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెలాఖరులోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మల్లికార్జున స్వామి, రెవెన్యూ ఆఫీసర్ నరసింహులు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, మున్సిపల్ పాల్గొన్నారు.

రేపు ఉపాధి హామీ ప్రజాదర్బార్

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకం పనులపై కల్హేర్‌లో ఈ నెల 13న (శుక్రవారం) ఉ.10 గంటలకు ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమేష్‌బాబు బుధవారం పేర్కొన్నారు. పనులు, నిధుల ఖర్చుపై గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ జరిగిందని చెప్పారు. డీఆర్‌పీలు సామాజిక తనిఖీ నివేదికను బహిర్గతం చేస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, కూలీలు హాజరు కావాలని కోరారు.

నేడు డెమో తరగతులు

నారాయణఖేడ్: మండలంలోని జూకల్ శివారులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ సబ్జెక్టును బోధించేందుకు గురువారం డెమో తరగతులను నిర్వహించనున్నట్లు గురుకులం ప్రిన్సిపాల్ లింగారెడ్డి తెలిపారు. అర్హత కలిగినవారు విద్యార్హత ధ్రువపత్రాలతో ఉ. 10 గంటలకు గురుకులానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్సీకి పరామర్శ

సంగారెడ్డి : అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎమ్మెల్సీ, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యులు ఆర్ సత్యనారాయణను మాజీ మంత్రి హరీశ్‌రావు బుధవారం పరామర్శించారు. పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఎల్‌ఈడీ లైట్ల అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని కొంతన్‌పల్లిలోని పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయానికి దాత కాంగ్రెస్ నాయకుడు కరుణాకర్‌రెడ్డి ఎల్‌ఈడీ లైట్లను అందజేశాడు. బుధవారం ఆలయ అర్చకుడు అచ్చుత్‌శర్మకు ఎల్‌ఈడీ లైట్లు అందజేశాడు. ఈ కార్యక్రమంలో శంకర్, వికాస్, రాజు, నవీన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

హిందూ ధర్మపరిరక్షణకు పాటుపడాలి

- జ్యోతిర్వస్తు విద్యాపీఠాధిపతి మహేశ్వర శర్మ సిద్ధాంతి



భూమిపూజ చేస్తున్న మహేశ్వర శర్మ సిద్ధాంతి

వట్‌పల్లి(అందోల్): హిందూ ధర్మ పరిరక్షణతోనే సమాజ హితం కలుగుతోందని జ్యోతిర్వస్తు విద్యాపీఠాధిపతి మహేశ్వర శర్మ సిద్ధాంతి అన్నారు. బుధవారం మండలంలోని మర్వెల్లిలో వీరభద్రేశ్వర ప్రసన్న ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో పాప భీతి పెరగడంతో పాటు కులమత భేదాలు, వర్గ వైషమ్యాలతో ప్రతిక్షణం మానవుడు భయపడుతున్నాడని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆధ్యాత్మికత పెరిగితేనే ప్రశాంతంగా ఉంటుందన్నారు. భూమి పూజా కార్యక్రమంలో గ్రామ వీరశైవ లింగాయత్‌లు, ఆర్య వైశ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతగా చేర్యాల జట్టు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కంది(సంగారెడ్డి): మండలస్థాయి సీఎం క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి. రెండవ రోజు బుధవారం అండర్ –18 విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. వాలీబాల్ బాలికల విభాగంలో 14 జట్లు తలపడగా చేర్యాల జట్టు మండలస్థాయి విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో కంది జట్టు నిలిచింది. కబడ్డీలో 11 జట్లు పాల్గొనగా విజేతగా ఇంద్రకరణ్ జట్టు, ద్వితీయ స్థానంలో చేర్యాల జట్టు నిలిచింది. అలాగే ఖోఖోలో చేర్యాల మొదటి స్థానంలో నిలువగా వడ్డేనగూడ తండా రెండవ స్థానం సాధించింది. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ ఎంపీఓ మహేందర్ రెడ్డి, సూపరింటెండెంట్ వేణుగోపాల్, పీఈటీలు, కార్యదర్శులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

సంగారెడ్డి టౌన్ : పట్టణంలోని అంబేడ్కర్ మైదానంలో సీఎం కప్ మండలస్థాయి క్రీడాపోటీలు బుధవారం నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 12న ముగింపు కార్యక్రమం ఉంటుందని మండల విద్యాధికారి విద్యాసాగర్ తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు.

సీఎం కప్ క్రీడాపోటీ ప్రారంభం

కల్హేర్(నారాయణఖేడ్): సీఎం కప్ మండలస్థాయి పోటీలు బుధవారం కల్హేర్ మండలం కృష్ణాపూర్, సిర్గాపూర్ మండలం నల్లవాగులో నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ అనిల్‌కుమార్, ఎంపీడీఓలు రమేష్‌బాబు, మల్లూర్, తహసీల్దార్లు శివశ్రీనివాస్, ఉమశంకర్, ఎంఈఓలు శ్రీనివాస్‌లు, నాగరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

లింగంపల్లి గురుకుల పాఠశాలలో..

మునిపల్లి(అందోల్): లింగంపల్లి గురుకుల పాఠశాలలో ఆయా గ్రామాల క్రీడాకారులు సీఎం కప్ క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. బుధవారం మహిళా విభాగంలో వాలీబాల్, ఖోఖోలో కంకోల్ ప్రథమ స్థానం నిలిచింది. ద్వితీయ స్థానంలో ఖమ్మంపల్లి. తృతీయ స్థానంలో పెద్దలోడి గ్రామాల కీడాకారులు నిలిచారు. పురుషుల విభాగంలో లింగంపల్లి, మునిపల్లి, ఖమ్మంపల్లి, వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచాయి. వాలీబాల్ అండర్ –18 బాలుర విభాగంలో మునిపల్లి, కంకోల్, ఖమ్మంపల్లి, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచాయని పీడీ కర్ణాకర్‌రెడ్డి తెలిపారు.

జర్నలిస్టులపై దాడి దారుణం



పటాన్‌చెరు టౌన్: జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపిన జర్నలిస్టులు



సంగారెడ్డి జోన్: నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

పటాన్‌చెరు టౌన్: సినీ నటుడు మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని జర్నలిస్టులు ధ్వజమెత్తారు. విచక్షణ కోల్పోయి జర్నలిస్టులపై చేసిన దాడిని పటాన్‌చెరు జర్నలిస్టు ఐక్యవేదిక ముక్తకంఠంతో ఖండించింది. దాడిని నిరసిస్తూ బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి పట్టణంలోని జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం డీఎస్పీ రవీందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. ఒక సినిమా నటుడుగా, నిర్మాతగా, డైరెక్టర్‌గా, పార్ట్ టైం రాజకీయ వేత్తగా, విద్యా సంస్థల నిర్వాహకుడిగా ఎన్ని పాత్రలు వేసినా తన క్రిమినల్ బుద్ధిని మోహన్‌బాబు ఏనాడు వదిలి పెట్టలేదని మండిపడ్డారు. అతని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్: జర్నలిస్టులపై సినీ నటుడు మోహన్‌బాబు దాడి చేయడాన్ని నిరసిస్తూ నారాయణఖేడ్‌లో జర్నలిస్టులు బుధవారం ర్యాలీ, ధర్నా, రాస్తారోకో చేపట్టారు. అనంతరం ఆర్డీఓ అశోక చక్రవర్తికి వినతిపత్రం సమర్పించారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన

సంగారెడ్డి జోన్: జర్నలిస్టులపై దాడి చేసిన నటుడు మోహన్‌బాబుని వెంటనే అరెస్టు చేయాలని జర్నలిస్టు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జర్నలిస్టులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బలరాం అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సినీ నటుడు మోహన్‌బాబు జర్నలిస్టులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

దాడిని ఖండిస్తున్నాం..

సంగారెడ్డి టౌన్ : అయ్యప్పస్వామి దీక్షలో ఉన్న జర్నలిస్టు రంజిత్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని అయ్యప్ప ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాము గురుస్వామి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప దీక్ష దారుడికి మోహన్‌బాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి విశ్వనాథరావు, గురుస్వాములు హరికిషన్ పాల్గొన్నారు.

నేడు రాజకీయ నేతలతో సమావేశం

నారాయణఖేడ్: మండల స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో 12న (గురువారం) సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఉ. 11గంటలకు సమావేశం ఉంటుందన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలు –2025 నిర్వహణలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం గ్రామపంచాయతీల పోలింగ్ కేంద్రాలకు సంబంధించి డ్రాఫ్ట్ చివరి జాబితా తయారీ, ప్రచురణకు సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పార్టీల ప్రతినిధులు విధిగా హాజరుకావాలని కోరారు.

న్యాల్‌కల్‌లో..

న్యాల్‌కల్(జహీరాబాద్): నేడు స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్లు, వార్డుల ఏర్పాటు తదితర అంశాలపై అభ్యంతరాలపై సమావేశం జరగనున్నట్లు చెప్పారు. ఉ.11.30 గంటలకు ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.



హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న అనిల్‌కుమార్

ఉన్నత చదువులు చదవాలి

కల్హేర్(నారాయణఖేడ్): విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని జిల్లా లీగల్ మెట్రాలజీ విభాగం అధికారి, మండల ప్రత్యేక అధికారి అనిల్‌కుమార్ ఆకాంక్షించారు. బుధవారం కల్హేర్‌లో ఎస్సీ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డెన్ కిషన్ ఉన్నారు.

తల్లి, కుమారుడు అదృశ్యం

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తల్లి, కుమారుడు అదృశ్యమైన సంఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన గోపిదాస్ ఏడాది క్రితం జీవనోపాధి కోసం తెల్లాపూర్‌కు వలస వచ్చాడు. ఓ నిర్మాణ సంస్థలో కూలీగా పని చేస్తున్నాడు. అతని భార్య రాణికుమారి, కుమారుడు (4) ఆయుష్రాబిదాస్ నెల రోజు ల క్రితం ఇక్కడి వచ్చారు. ఎప్పటిలాగనే గోపి దాస్ బుధవారం పనికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి భార్య, కుమారుడు కనిపించలేదు. దీంతో వారి ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.